సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

గురువారం 22-5-2025

సంపుటి: 21 సంచిక: 50
పేజీలు: 8 వెల: రూ.1

20 YEARS
2005-2025



# Happy Anniversary to SATYAM

జనసేన



కొరికాన భవాని
జనసేన నాయకురాలు,
పాతపట్నం నియోజకవర్గం



సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'కు

## వార్షికోత్సవ శుభాకాంక్షలు

అన్యాయాలు, అక్రమాల పాలిట అక్షరాస్త్రం..
అధికార, ప్రతిపక్షాలకు సమాన దూరం..
నిసలైన ప్రజాపక్షంగా.. ప్రజాహితమే లక్ష్యంగా
సంచలన కథనాలకు కేరాఫ్‌గా..
సమాజ ప్రగతికి మార్గదర్శిగా..
నిత్యం సత్యం నినదిస్తూ..
రెండు దశాబ్దాల విజయ యాత్ర
పూర్తిచేసుకున్న 'సత్యం' పత్రిక
ఇకముందూ అప్రతిహతంగా
దూసుకుపోవాలని ఆకాంక్షిస్తూ..

## 'సత్యం' బృందానికి

## శుభాకాంక్షలు






## కొరికాన రవికుమార్

చైర్మన్, శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా)

• ఎడిటోరియల్

# రాజీవ్‌పై దివాలాకోరు వాదనలు!

మాజీ ప్రధాని, అఖిల భారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులే మర్చిపోయినట్లున్నాయి. ఎక్కడా పెద్దగా జరిగిన దాఖలాల్లేవు. ఆయనకెవరూ నివాళులర్పించకపోయినా ఫర్వాలేదు గానీ.. ఆయన వల్ల పొందిన మేలును విస్మరించి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయ వల్లే తమ ఉనికిని నిలుపుకోగలిగామనే దివాలాకోరు వ్యాఖ్యలను కొందరు నాయకులు చేస్తుండటం విచారకరం. అంతకంటే దుర్మార్గం మరేదీ ఉండదు. వైఎస్ రాజకీయ ఎదుగుదలకు ఒకరకంగా రాజీవ్‌గాంధీయే కారణం. 32 ఏళ్ల పిన్న వయసులో తాను పీసీసీ అధ్యక్షుడిని అవుతానని రాజశేఖర్ రెడ్డే ఊహించలేని తరుణంలో.. రాజీవ్‌గాంధీ చొరవ తీసుకుని తన తల్లి, అప్పటి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఇందిరాగాంధీని ఒప్పించి రాజశేఖర్ రెడ్డికి ఆ పదవి కట్టబెట్టారు. అప్పటి నుంచే వైఎస్‌కు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంచి ఎలివేషన్ వచ్చింది. అదే ఆయన ముఖ్యమంత్రి పదవి పొందేందుకు పునాదిలా ఉపయోగపడింది. ఇందిర, రాజీవ్‌ల అకాల మరణం తర్వాత వైఎస్ రాజకీయ జీవితం అగమ్యగోచరంగా మారింది. పీవీ నరసింహారావు జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాక రాష్ట్ర రాజకీయ మ్యాపులో దాదాపు వైఎస్ లేకుండా చేశారు. ఆ కారణంగానే ఆనాడు పీవీ సభలో వేదికపైకి చెప్పులు విసిరిన ఘటన చోటు చేసుకుంది. కర్రెద్దుల కమలకుమారి, కమలుద్దీన్ అహ్మద్, చింతా మోహన్, పీవీ రంగనాయుడు.. ఇంకా ఎవరెవరో మన రాష్ట్రం నుంచి పీవీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నా వైఎస్‌కు మాత్రం రిక్తహస్తమే ఎదురైంది. 1985 ఎన్నికల్లో కాంగ్రెస్ పుంజుకోకపోగా వైఎస్ పీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జలగం వెంగళరావుకు అప్పగించారు. ఆ తర్వాత చెన్నారెడ్డి రావడం, రంగా దారుణ హత్య, 1989లో కాంగ్రెస్ గెలుపు వంటి వరుస ఘటనలు జరిగాయి. 1994లో మళ్లీ కాంగ్రెస్ ఓడిపోయి పీవీ దిగిపోయిన తర్వాత కొద్దిరోజులు సీతారామ్ కేసరి నాయకత్వం వహించినప్పటికీ తిరిగి సోనియాగాంధీ పగ్గాలు చేపట్టి 18 రాష్ట్రాల్లో తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది. ఆ క్రమంలోనే 1998లో వైఎస్ మళ్లీ పీసీసీ అధ్యక్షుడిగా సోనియా ద్వారా నియమితులయ్యారు. అప్పుడు కూడా కాంగ్రెస్ గెలవలేదు. అయితే చంద్రబాబు మార్కు పాలన, రాష్ట్రంలో కాంగ్రెస్ మినహా వేరే ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల 2004లో కాంగ్రెస్ గెలిచింది. దానికి ముందు 1996, 1998 పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 22 చొప్పున పార్లమెంటు సీట్లను రాష్ట్రంలో అధికారంలో లేని కాంగ్రెస్ గెలుచుకోవడం విశేషం. ఇందులో వైఎస్ కృషి, ప్రమేయం పెద్దగా లేదు. సంప్రదాయంగా కాంగ్రెస్ వైపు ఉన్న దళితులు, మైనారిటీలు, కాపులు ఇతర బలహీన వర్గాల ఓట్లే దీనికి కారణం. 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ విజయంలో వైఎస్ పాత్రను తక్కువ చేయలేం గానీ.. మొత్తంగా అతనే గెలిపించారనడం అతిశయోక్తే. నాడు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా గెలిచి కేంద్రంలో అధికారం చేపట్టింది. సోనియా నాయకత్వంలోనే కాంగ్రెస్ రెండుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. వాస్తవాలు ఇలా ఉంటే జగన్‌ను కష్టాల పాలు చేయడం వల్ల కాంగ్రెస్ అస్తిత్వాన్ని కోల్పోయిందనటం దారుణం. ఆంధ్రలోనే కాంగ్రెస్ అస్తిత్వం కోల్పోయింది. పక్కనున్న తెలంగాణలో ఆ పార్టీయే అధికారంలో ఉంది. జగన్‌ను గుర్తించకపోవడం వల్ల కాంగ్రెస్ అస్తిత్వం కోల్పోయిందనడం ఆత్మవంచనే. ఉమ్మడి ఏపీ విభజన వల్ల సీమాంధ్ర ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని తెలిసినా సోనియా గాంధీ విభజన నిర్ణయం తీసుకున్నందునే ఇక్కడి ప్రజలు ఆమె కుటుంబంపై ఆగ్రహించారు. ఈ కారణంతోనే కాంగ్రెస్, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా జగన్ బలం పుంజుకున్నారు. అప్పటి రాజకీయ పరిస్థితులను తనవైపు మలచుకోవాలని, తన తండ్రి అకాలమరణం తాలూకు సానుభూతి మొత్తం తనకే దక్కాలనే రాజకీయ వ్యూహంతో ఒక్కో అడుగూ వేసుకుంటూ వెళ్లారు. అయినా కూడా 2014లో అధికారం సాధించలేదు. చంద్రబాబు భీకర పాలన వల్ల 2019లో జగన్‌కు రికార్డు మెజారిటీ లభించింది. తిరిగి అంతే స్థాయిలో ఆయన తిరిగి చంద్రబాబుకు అధికారాన్ని అప్పగించేంత వరకు నిద్రపోకుండా నిర్విరామ కృషి చేశారు. నిజాలు ఇలా ఉంటే రాజీవ్ గాంధీకి నివాళులర్పించే నెపంతో మన దుర్భావనలన్నీ ఆ కుటుంబం మీదకి నెట్టేస్తామంటే ఎలా? సోనియాగాంధీ లేకుంటే పార్టీలో ఈ గుర్తింపు ఉండదని తను బతికున్నప్పుడు వైఎస్ ఎన్నోసార్లు అన్నారు. మాటల్లో, చేసే వ్యాఖ్యల్లో న్యాయం ఉండాలి. రాజీవ్‌ను చిన్నచూపు చూసిన, ఆయన వర్ధంతిని విస్మరించిన వారందరి తరఫున మనఃపూర్వక నివాళి.

## క్రిస్టియన్ మైనారిటీస్ థాంక్యూ సీఎం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫారం ఆధ్వర్యంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను క్రిస్టియన్ పాస్టర్, పెద్దలు గౌరవపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం క్రిస్టియన్ మైనార్టీస్‌కు తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. క్రైస్తవ ఫాస్టర్స్‌కు ఏడు నెలలకు గానూ రూ.35 వేలు గౌరవ వేతనం అందించడం హర్షణీయమన్నారు. దీనికిగానూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు క్రిస్టియన్ మైనార్టీస్ తరుఫున ధన్యవాదాలు తెలపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను ఆశీర్వదించి సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శామ్యూల్ అరుణ్‌కుమార్, బ్రదర్ అసిర్‌కుమార్ డాక్టర్ ప్రత్తిపాటి ప్రసాద్, టెక్కలి రామారావు, జాన్ పీటర్ తమ్మినే డిపేట ఇస్సాకు, ప్రేమ్‌కుమార్ కృష్ణ, బోరును, అబ్రహాము హాయనీబాబు, శోభన్ గిరిజన పాస్టర్ అసోసియేట్ అన్నపు ఆనంద్ పాల్, సాంబమూర్తి, అహరోన్ రాజ్ గౌతమ్, అనంతు జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.




## తెలుగుదేశం కార్యకర్తకు ఆర్థిక సహాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీయే కాక పార్టీ నాయకులు కూడా తామున్నామంటూ ఆదుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మంగళవారం పిడుగుపాటుకు శ్రీకాకుళం పట్టణంలోని బుచ్చిపేటకు చెందిన గేదెల రాజారావు మృతి చెందగా కుమారుడు నాగార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఆ కుటుంబం ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మానవతాదృక్పథంతో రూ.50వేలు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబాన్ని పార్టీ కూడా ఆదుకుంటుందని పార్టీ నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీ, పార్టీ నాయకులు కూడా ఈ విధంగా సహాయం చేయడం పట్ల ప్రజలు ఎంత సంతోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి గిరిజాశంకర్, నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జామియా మసీదు సందర్శన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో ఉన్న జామియా మసీదును గురువారం ఎమ్మెల్యే గొండు శంకర్ గారు సందర్శించారు. ఇటీవల కాలంలో జామియా మసీదులో జరిగిన గంధపు చెట్ల దొంగతనాన్ని పరిశీలించారు. నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, దేవుడు మాన్యాన్ని దొంగతనం చేసిన దొంగల్ని వెంటనే పట్టుకోవాలని డిఎస్పీని కోరారు. ప్రస్తుతం మసీదులో జరుగుతున్న పరిణామాలను ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ పాండ్రంగి శంకర్, నగర టిడిపి మైనార్టీ విభాగం అధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ భాష, మైనార్టీ నాయకులు ఎండి రఫీ, జాంగిర్ ముస్లిం మత పెద్దలు మీర్ అసదుల్లా, ఢిల్లీ ఇంజనీరింగ్ భాష, రవూఫ్ ఖాన్, ఆర్.టి.ఖాన్, షేక్ అహ్మద్ తాజ్, అలీలు పాల్గొన్నారు.



## సహజ యోగాతోనే మానసిక ప్రశాంతత

(సత్యంన్యూస్, లావేరు)

సహజ యోగా ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సహజ యోగా ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్ రామకృష్ణ పేర్కొన్నారు. లావేరు మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని పట్నావానిపేట, రేగపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో శ్రీ మాతాజీ నిర్మలాదేవి చైతన్య రథంతో పర్యటించి సహజ యోగా ధ్యాన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, ఈ ఒత్తిడి నుంచి తట్టుకోవాలంటే ధ్యానం చేయడం ఒక్కటే మార్గమన్నారు. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు మనం చేసే పనులపై ఏకాగ్రత పెరిగి ఆత్మవిశ్వాసం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సహజ యోగులు, యోగిలు కాగితాల గోవింద్ రెడ్డి, బి.శ్రీను, ఏ.నర్సింహులు, పి.భాస్కరరావు, లింగాల శ్రీనువాసరావు, కాంతారావు, రమణమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రంలో ఉన్న అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఎంఎస్ నెంబర్ 142ను రద్దు చేసి వర్కింగ్ జర్నలిస్టుల అందరకీ సత్వరమే జాప్యం చేయకుండా సకాలంలో అక్రిడేషనలు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఎల్.స్వర్ణలత, ఓ. మధుసూధన్‌లకు వినతి పత్రాలు సమర్పించామని ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి శాసపు జోగినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం మీడియా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అర్హులైన వారికి కనీసం ఎక్రిడేషన్ కార్డు ఇవ్వలేకపోయారని, దీనివల్ల మీడియాను నమ్ముకొని జీవనం సాగించే అనేక కుటుంబాలు ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీడియా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం, ఇల్లు లేని వారికి ఇల్లు వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని జోగినాయుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పత్రికలకు, టీవీ ఛానల్స్‌కు యుద్ధప్రాతపదికన అక్రిడేషను కార్డులు జారీ చేయాలని, మీడియా అక్రిడేసన్ కమిటీల్లో గుర్తింపు పొందిన జర్నలిస్టు యూనియన్స్‌కు సముచిత స్థానం కల్పించాలని ఆయన సూచించారు.. ప్రెస్ అకాడమీకు చైర్మన్ గా ఒక సీనియర్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్ కుమార్‌ను నియమించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి,కూటమి నేతలకు జోగినాయుడు ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో అభినందించారు.




జంధ్యాల గారు దర్శకత్వం వహించిన సినిమాలు అన్నింటిలోనూ నాకు అత్యంత ఇష్టమైన సినిమా ఈ ఆనందభైరవి . కళా తపస్వి విశ్వనాధ్ దర్శక చరిత్రలో శంకరాభరణం, సప్తపది ఎలాగో జంధ్యాలకు ఈ ఆనందభైరవి అలాంటిది. ఈ సినిమా కేవలం నాట్య, సంగీతభరిత సినిమా మాత్రమే కాదు. వేల సంవత్సరాలుగా మనసుల్లో పాతుకుపోయిన మూఢాచారాలకు, దుస్సాంప్రదాయాలకు పాతర వేయటానికి చేసిన ప్రయత్నం కూడా. అందువలన ఈ సినిమాను శంకరాభరణం, సప్తపది వరుసలోకి తీసుకుని వెళ్ళాలి. సాగరసంగమం, సిరిసిరిమువ్వ వరుసలోకి కూడదని నా అభిప్రాయం. ఇట్స్ ఏ మ్యూజికల్ వండర్ స్ప్లెండర్. ఓ అపురూప దృశ్య కావ్యం, ఓ కళాఖండం.

# నిజంగా.. ఆనంద భైరవమే!!

- సుబ్రమణ్యం దోగిపర్తి

మన తెలుగు వారి నాట్యం కూచిపూడి. ఆ కూచిపూడి నృత్యాన్ని ఆడవారు ఆడకూడదని సిద్ధేంద్ర యోగి ఆంక్ష విధించారని, అది ఆనాటి కాల మాన దేశ పరిస్థితులను బట్టి ఆ ఆంక్షను విధించి ఉంటారని నారాయణ శర్మ చేత చెప్పిస్తాడు జంధ్యాల. శిక్షణ ఇస్తే కులంతో సంబంధం లేకుండా నైపుణ్యం ఉన్న ఎవరయినా రాణిస్తారని సమాజానికి చెప్పే ప్రయత్నం ఈ సినిమా. తన తర్వాత తన నాట్య వారసత్వాన్ని తన కుమారుడు కొనసాగించాలని శర్మ గారి ఆకాంక్ష. కడుపు నింపని ఆ కూచిపూడి నృత్యం కన్నా మామూలు చదువు చదువుకుని సుఖంగా బతకటం మంచిదని ఆ తల్లి, మేనమామల ఆలోచన. నిస్సహాయ స్థితిలో రోడ్ల మీద సర్కస్ ఫీట్లతో కడుపు నింపుకునే ఒక దొమ్మరి పిల్లను తెచ్చుకుని ఆమెను గొప్ప నృత్య కళాకారిణిగా తీర్చిదిద్దుతారు శర్మ గారు. ఆ క్రమంలో అగ్రహారీకుల చేత బహిష్కరించబడతాడు. శర్మ గారు భార్యను త్యజించి ఊరి చివర పాక వేసుకుని ఆ దొమ్మరి పిల్లకు భైరవి అని అమ్మ వారి నామాన్ని ఇచ్చి గొప్ప నృత్య కళాకారిణిని చేస్తారు.

మాళవిక.. నృత్య పోటీలో గెలిచి తన గురువు గారిని అదే ఊరి వాళ్ళు కంకణం తొడిగి గౌరవించేలా చేస్తుంది భైరవి. తన భార్య పది మందిలో నాట్యం చేయ ఇష్టం లేని కొడుకుతో కాకుండా మరో కరటకునితో వివాహం నిశ్చయించి, పెళ్లి పీటల మీద నుంచి వెళ్ళిపోయి ఆనందుని వివాహం చేసుకుంటుంది భైరవి. జీర్ణించుకోలేని శర్మ గారు తనువు చాలిస్తారు. కొండముది శ్రీరామచంద్ర మూర్తి వ్రాసిన చిరుమువ్వల మరుసవ్వడి నవల ఆధారంగా నిర్మించబడిన ఈ సినిమా ఆ కథను తెరకు ఎక్కించిన విధానం అద్భుతం. ఇక్కడే ఏ దర్శకుని సృజనాత్మకత బయటపడేది. అందులో జంధ్యాల సఫలీకృతులు అయ్యారు. ముఖ్యంగా భైరవి పాత్రకు కథక్ నృత్యకారిణి మాళవికను, శర్మ గారి పాత్రకు గిరీష్ కర్నాడుని, శర్మ గారి తండ్రి పాత్రకు పుచ్చా పూర్ణానందం గారిని, శర్మ గారి భార్యగా కాంచనను ఎంపికే అసామాన్యం. ఆ పాత్రలకు సరైన ఎంపికలు. ఈ సినిమా కొరకు యాభై ఏళ్ళు దాటిన గిరీష్ కర్నాడ్ కష్టపడి కూచిపూడి నాట్యాన్ని నేర్చుకున్నాడట. ఈ సినిమా క్లైమాక్సులో యోగమార్గం ద్వారా కపాల భేదనం పొందే సీన్లో అద్భుతంగా నటించారు. ఆ సీన్లో ఆయన ప్రదర్శించిన నాట్య నైపుణ్యం అద్భుతం. కపాల భేదనం పొందిన మనుషులకు పునర్జన్మ లేని మోక్షం ప్రాప్తిస్తుంది అనేది సనాతన ధర్మంలో విశ్వాసం. ఆ నిష్క్రమణను ఈ సినిమాలో యోగమార్గం ద్వారా జంధ్యాల చాలా గొప్పగా చూపారు. ఇక్కడే జంధ్యాల అపర విశ్వనాథ్ అయిపోయాడు. ఈ సినిమాలో మరో గొప్ప పాత్ర శర్మ గారి తండ్రి పాత్ర. ఈ పాత్రను ధరించిన పుచ్చా పూర్ణానందం గారిది మా గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెద కొండూరు గ్రామం. బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎంఏ, ఎల్ఎల్‌బీ చేసిన ఈయన తెనాలిలో ప్లీడర్ వృత్తిలో ఉంటూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వ్యక్తి. సావర్కర్ అభిమాని. రచయిత గోపీచంద్ సహాధ్యాయి. రంగస్థల నటుడు అయిన వీరిని ఈ సినిమా ద్వారానే వెండితెరకు పరిచయం చేసారు జంధ్యాల. తర్వాత జంధ్యాల మరి కొన్ని సినిమాలలో కూడా చక్కని నటనను ప్రదర్శించారు. కాంచన. కుమారుడి మీద ప్రేమ, భర్త పట్టుదల తెలిసిన ఇల్లాలి బాధ్యతల మధ్య నలిగిపోయే మహిళగా చాలా గొప్పగా నటించింది. ఈ నలుగురి తర్వాత చెప్పుకోవలసింది సుత్తి జంట , శ్రీలక్ష్మి. ఎక్కడా విసిగించకుండా ఈ ముగ్గురి హాస్యాన్ని మలిచాడు హాస్యబ్రహ్మ జంధ్యాల. ముఖ్యంగా ఈల రాణిగా శ్రీలక్ష్మి నటన ప్రేక్షకులు మరచిపోలేరు. సినిమా నడకలో చక్కటి భాగం అవుతాడు సుత్తి వీరభద్రరావు. బాగా నటించారు. సంగీత, నృత్య ప్రధానమైన ఈ సినిమాకు ప్రాణం రమేష్ నాయుడు సంగీత దర్శకత్వ, శేషు నృత్య దర్శకత్వం. మౌనం కూడా భాషే. ఈ మౌన భాషను ఈ సినిమాలో రమేష్ నాయుడు బాగా చూపారు. సౌండ్ లేకుండా కొన్ని సన్నివేశాలు నడుస్తాయి. మౌన భాషతో పాటు శబ్దం. పాటలన్నీ శ్రావ్యంగా ఉంటాయి.

ముందుగా గుర్తుకొచ్చే పాటలు పిలిచిన మురళికి వలచిన మువ్వకు ఎదలో ఒకటే రాగం అది ఆనంద భైరవి రాగం. అసలు ఈ టైటిల్ని ఎంపిక చేసుకోవటం లోనే జంధ్యాల సక్సెస్ నిండి ఉంది. హీరో పేరు ఆనంద్. హీరోయిన్ పేరు భైరవి. వెరశి ఆనందభైరవి. అది రాగం కూడా. మరోసారి హేట్సాఫ్ టు జంధ్యాల. మరో పాట కొలువైతువా రంగశాయీ. దేవులపల్లి వారు వ్రాసిన ఈ పాట నాట్య పోటీకు చిత్రీకరించబడింది. అద్భుతంగా ఉంటుంది. జీవన సారమంతా కలబోసిన పాట సుడిగాలిలోన దీపం కొడగొట్టిపోతే మాయం. వేదాంతాన్ని అంతా రంగరించి పోసారు ఈ పాటలో. జిత్ మోహన్ మిత్రా, కాకినాడ శ్యామల, చిరంజీవి కవితల మీద ఉంటుంది. రోడ్ మీద వేసే గారడీలో ఇంత వేదాంతాన్ని పెట్టటం, సాధారణ జనం భాషలో వ్రాయటం గొప్ప విషయం. మరో పాట చైత్రము కుసుమాంజలి. శిష్యురాలికి నాట్యం నేర్పించే పాట. అద్భుతమైన చిత్రీకరణ. ఇలాంటిదే మరో పాట బ్రహ్మాంజలి. ఇదీ నాట్యం నేర్పే మొదట్లో వస్తుంది. గురు బ్రహ్మ అంటూ మొదలయ్యే ఈ పాటలో శర్మ గారు తన తండ్రి పాదాలకు నమస్కరిస్తే, భైరవి శర్మ గారికి నమస్కరించటం చాలా బాగా చూపారు జంధ్యాల. క్లైమాక్స్ గీతం రా రా రా రాగమై. ఇదే కొద్దిగా సెట్, ఫిట్ కాలేదేమో అనిపిస్తుంది నాకు. ఈ పాటల్ని వ్రాసిన వేటూరి, దేవులపల్లి, బి యల్ యన్ ఆచార్యలను, పాడిన బాలసుబ్రమణ్యం, యస్ జానకి, యస్ పి శైలజలను అభినందించాలి. సినిమా కథనానికి ప్రాణం పోసారు. ఇతర ప్రధాన పాత్రల్లో ముఖ్యమయినది ఆనంద్ స్నేహితురాలి పాత్ర ప్రియ. రెండు జెళ్ళ సీత మహాలక్ష్మి బాగా నటించింది. చక్కటి పాత్ర. ఆమె తండ్రిగా రమణమూర్తి, దుర్బుద్ధి స్నేహితుడు కరటకునిగా శుభాకర్ నటించారు. ఇతర పాత్రల్లో హేమసుందర్, డబ్బింగ్ జానకి, ప్రభృతులు నటించారు. ఈ సినిమా ఔట్ డోర్ షూటింగ్ అంతా కోరుకొండలో చేసారు. ఆ గ్రామం, పరిసర ప్రాంతాల, బీచ్, వగైరాలను అన్నీ గోపాలరెడ్డి గారు బ్రహ్మాండంగా కెమేరాలో బంధించారు. కోరుకొండ విశిష్టాద్వైత సంఘం వారికి టైటిల్సులో ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు జంధ్యాల. వారిదీ ప్రధాన పాత్రే సినిమాలో. ఈ సినిమాలో నృత్యమే ప్రధానం. భైరవితో పాటు నృత్య పోటీలలో పాల్గొనే నాట్యకారుడిగా నాట్యాచార్య వెంకట రామ శర్మ మహాద్భుతంగా నర్తించారు. ముఖ్యంగా రెండో పోటీలో ఈ మహానుభావుడు, మాళవికలు తమ నాట్య విరాటాన్ని ప్రదర్శిస్తారు. హ్యాట్సాఫ్ టూ బోత్ ఆఫ్ దెమ్.. ఇంత గొప్ప దృశ్య కావ్యానికి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇచ్చారు తెలుగు ప్రేక్షకులు. 11 కేంద్రాలలో వంద రోజులు ఆడించారు. వంద రోజుల ఫంక్షన్ మద్రాస్ వళ్ళువార్ కొట్టంలో జరిగింది. అంతేనా ! అవార్డుల వర్షం కురిసింది. నాలుగు నంది అవార్డులు వచ్చాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ ఛాయాగ్రాహణం, ద్వితీయ ఉత్తమ కథారచన. ఇవే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్ర దర్శకత్వానికి కూడా. ఇవన్నీ కాకుండా ఔత్సాహిక కళా వేదికలు ఇచ్చిన పురస్కారాలు కుప్పలుకుప్పలు. ఇంత గొప్ప దృశ్య కావ్యానికి కారణమయిన కూచిపూడి నృత్యం మన తెలుగు వారిది. రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామానిది. అలాంటి ఈ కూచిపూడి గ్రామంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయాన్ని మన ప్రభుత్వం నెలకొల్పటమే ఈ నాట్యానికి మనమంతా ఇచ్చే నివాళి. ఇంతకుముందు ఎవరయినా ఈ సినిమాను చూడకపోతే అర్జెంటుగా చూసేయండి. మన తెలుగు నాట్యానికి, సంస్కృతికి, అభ్యుదయ భావజాలానికి పెద్ద పీట వేయండి. విశ్వనాథ్ ఎంత చిరస్మరణీయుడో, ఈ సినిమా ద్వారా జంధ్యాల కూడా అంత చిరస్మరణీయుడు. ఎందరో మహానుభావులకు అందరికీ వందనములు!!

» కాలేజీ, కోర్సుల ఎంపికతోనే విద్యార్థి భవిష్యత్
» మల్టీ స్పెషలైజేషన్ డిగ్రీతో విద్యార్థులకు మంచి కెరీర్ » ఐఐటిలకు ధీటుగా ఐఐఎంలు
» ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలపై పద్మావతి జూనియర్ కాలేజీలో సదస్సు



# నేటి ఆలోచన.. రేపటి భవిత!

చదవాలనే ఆశయం ఉన్నా అవగాహన లేక చాలామంది విద్యార్థులు వెనుకబడుతున్నారు. సరైన మార్గదర్శనం లేక ఏదో ఒక కాలేజీలో చేరి.. అర్హత లేని ఫ్యాకల్టీ చెప్పే పాఠాలు విని.. చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతుంటారు. లక్షలాది మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ లేక తల్లి దండ్రుల మీద ఆధారపడడం చూస్తున్నాం. భవిష్యత్ బాగుండాలంటే ఇంటర్ దశలోనే విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన ఉండాలి. ఈ విషయంపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు గురువారం పద్మావతి జూనియర్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ మాకేనా సతీష్ పలు సూచనలు చేసారు.

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎంచుకునే మార్గంతోనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. కేవలం ఐఐటి, ఎన్ఐటిలు మాత్రమే కాకుండా ఐఐఎంలలో చేరడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొంద వచ్చన్నారు. నేటి తరంలో మల్టీ స్పెషలైజేషన్ డిగ్రీని పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. డ్యూయల్ డిగ్రీతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉంటాయని, రెగ్యులర్ విధానంలో ఒక డిగ్రీ చేస్తూనే ఆన్‌లైన్‌లో మరొక డిగ్రీ పట్టా సాధించవచ్చని అన్నారు. కోర్సెరా, లింక్డిన్ లాంటి సంస్థలు వందల సంఖ్యలో సర్టిఫికేట్ కోర్సులు ఉచితంగా అందిస్తున్నాయని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బైపీసీ విద్యార్థులు కేవలం మెడిసిన్, అగ్రికల్చర్, ఫార్మసీ తదితర కోర్సులు మాత్రమే కాకుండా బయోటెక్, బయో కెమిస్ట్రీ, ఫోరెన్సిక్‌సైన్స్ వంటి కోర్సులు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆలోచనే రేపటి భవితకు బాటలు వేస్తుందని, ఉన్నత విద్య అందించే కాలేజీలో చేరితే లక్ష్యం దానంతట అదే నెరవేరుతుందన్నారు. కరిక్యులమ్, సిలబస్ రెండింటికీ ప్రాధాన్యమిస్తూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటందించే విద్యాసంస్థలను ఇంటర్ తర్వాత ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇంటర్ తర్వాత తప్పటడుగు వేస్తే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఇంటర్ తర్వాత ఏ కోర్సు చదవాలి, ఏ యూనివర్శిటీలో చేరితే బాగుంటుందనే విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యా సదస్సులు అభినందనీయం



విద్యా సమాచారానికి సంబంధించిన అవగాహన సదస్సులు గతంలో పట్టణాల్లో మాత్రమే నిర్వహించేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా నిర్వహించడం గొప్ప విషయం. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యావకాశాలపై సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించిన పద్మావతి కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు.

పంచిరెడ్డి దయ

### ఎన్నో విషయాలు తెలుసుకున్నా



నేను బీటెక్ సివిల్, మెకానికల్ కోర్సులు చేయాలనుకుంటున్నా. ఈ కోర్సుల్లో అమ్మాయిలు చేరితే భవిష్యత్తు ఉండదని, చాలా కష్టమని అంటున్నారు. వీటిపై వివరణ కావాలని సదస్సు తర్వాత నేను వేదికపై మాట్లాడాను. నాకు అక్కడ ఉన్న విద్యావేత్తలు చక్కగా మార్గనిర్దేశం చేసారు. నా అనుమానాలన్నీ తొలగిపోయాయి.

- సిహెచ్ పద్మజ

### సాధారణ డిగ్రీ ప్రాముఖ్యత తెలుసుకున్నా



ఇంటర్ తర్వాత బీటెక్ చేయాలన్న ఆలోచన మాత్రమే ఉండేది. కానీ, అవగాహన సదస్సు ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నాను. సాధారణ డిగ్రీలో మంచి కోర్సు చేస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చనే దానిపై వివరించారు. ఇప్పుడు నాకు ఒక క్లారిటీ వచ్చింది. డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి కోర్సుల ప్రాముఖ్యత తెలుసుకున్నాను.

ఆళ్ల ప్రియాంక

### లక్ష్యం వైపు అడుగులు వేస్తా..



ఇంటర్ తర్వాత ఏ కోర్సును ఎంపిక చేసుకుంటే మంచిదనే విషయాలను చాలా బాగా వివరించారు. లక్ష్యం వైపు అడుగులు వేస్తాను. పద్మావతి కళాశాల వారు కల్పించిన అవగాహన ఎంతో ఉపయోగపడుతుంది. భవిష్యత్‌లో ఏదైనా సాధించాలంటే మొదటగా మార్గాన్ని ఎంచుకోవాలని తెలుసుకున్నాను. లక్ష్యాన్ని చేరుకోవాలన్న తపన పెరిగింది.


చల్ల రాము

## హిమబిందుకు నేషనల్ స్కాలర్‌షిప్


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కూచిపూడి నాట్యంలో 2022-23 లో కేంద్ర ప్రభుత్వం సిసిఆర్‌టి ఆధ్వర్యంలో యువ కళాకారులకు జాతీయ ఉపకార వేతన ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. దీనిలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన శివశ్రీ నృత్య కళా నికేతన్ వ్యవస్థాపకులు డాక్టర్ రఘు పాత్రుని శ్రీకాంత్ శిష్యురాలైన హిమ బిందు ఉత్తీర్ణురాలై జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఒక్కరే ఎంపికయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియలో శ్రీకాకుళ పట్టణం నుండి ఎంపికైన మొదటి కళాకారిని కుమారి హిమబిందు కావడం విశేషం. ఈ సందర్భంగా కుమారి హిమబిందుకు మరియు గురువు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ గారికి కళా సంస్థలు, కళాభిమానులు అభినందనలు తెలిపారు.



శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశానికి ఆముదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర అధ్యక్షులు హోదాలో పాల్గొని ఎన్నికలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం



శ్రీకాకుళం నియోజకవర్గంలో రూరల్ మండలం పాత్రుని వలస పంచాయతీ టీడ్కో కాలనీలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామి విగ్ర ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్

## రక్తదాతలుగా మారి ప్రాణదాతలుకండి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ప్రతీ పౌరుడు రక్తదాతలుగా మారి, ప్రాణదాతలుకండని, శ్యాంకింగ్ పిస్టన్స్ అండ్, రింగ్స్ లిమిటెడ్ ప్లాంట్ డైరెక్టర్ ఎస్.కిషోర్ గురువారం తెలిపారు. మండలంలోని అరిణాం అక్కివలసలో గల శ్యాంకింగ్ పిస్టన్స్ అండ్, రింగ్స్ లిమిటెడ్ ప్లాంట్ త్రీ సంస్థ వ్యవస్థాపకులు ప్రత్యేకంగా మూడువేల కుటుంబాలకు, పరోక్షంగా వేల కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తున్నారన్నారు. ప్లాంట్ డైరెక్టర్ ఎస్.కిషోర్ మాట్లాడుతూ స్వర్గీయ సారిపల్లి మృత్యుంజయరావు రెండవ వర్ధంతి సందర్భంగా ప్లాంట్ త్రీలో ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (కార్మిక సంఘాల సమాఖ్య) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో అందరూ పాల్గొని రక్తదానం చేశారని తెలిపారు. నగరంలో రక్త కొరత కారణంగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధి, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రాలకు డబ్బై మూడు యూనిట్ల రక్తనిల్వలు అందించామన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో పరిశ్రమ డీజీఎం వైవి. కృష్ణారావు, కె.సూర్యనారాయణ, ప్రభుత్వ రక్తనిధి అధికారి డాక్టర్ కె.కావ్య, ఎస్.తాతారావు, రెడ్ క్రాస్ రక్తనిధి పిఆర్వో పెంకి చైతన్య, ఎపిఆర్వో ఉమా శంకర్, యూనియన్ కార్యదర్శి ఆర్.అనంతరావు, అధ్యక్షులు ఎం.శ్యాం సుందర్రావు, పి.వీరస్వామి, ట్రెజరరీ జె.చంద్రశేఖర్, కమిటీ సభ్యులు, అల్లంశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.






విద్యార్థులకు చిన్నప్పటినుంచి నీతి కథలు తెలుగు పద్యాలు చదవడం అలవాటు కావాలని అని వరం హైస్కూల్ గ్రేడ్ 1 తెలుగు ఉపాధ్యాయులు ఉప్పు త్రినాధ్‌రావు అన్నారు. బలగ హడ్కోకాలనీలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురు వారం ఆయన పిల్లలకి వేమన శతకం, సుమతీ శతకం పద్యాలు సరళంగా పిల్లలకు అర్థమయ్యేటట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను, సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

మొండేటి వీధిలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 8:30 నిమిషాలకు సహస్ర తమల అర్చన కార్యక్రమం జరిగినది. యావన్మంది భక్తులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా సాయంత్రం 6:30 నిమిషాలకు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం జరుగును. స్వామి వారి అనుగ్రహానికి కృపకి పాత్రులు కాగలరని కోరారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.



## సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని, కెప్టెన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, దశరధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న కెప్టెన్స్ (డ్రైవర్లు), సిఐటియు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక్క రోజు సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద నిన్న నిరసన చేపట్టామని, ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇప్పించాలని, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలతో మారుమూల ప్రాంతాల్లో సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నామని, తమ సేవలను ప్రభుత్వాలు గుర్తించడంలో విఫలమవుతున్నాయన్నారు. కలక్టర్ స్వప్నిల్ దినకర్‌కు వినతి పత్రం అందించామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సమస్యలు పరిస్కారమయ్యే విధంగా చొరవ తీసుకుంటామని చెప్పటం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. అరబిందో యాజమాన్యం గత పది సంవత్సరాలుగా అతి తక్కువ వేతనం ఇస్తున్నాయని, ఆ వేతనంతో పెరిగిన నిత్యవసరాలతో జీవనం సాగించడం దుర్భలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వాటా పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ ను యాజమాన్యమే చెల్లించాలని




డిమాండ్ చేశామని, చట్టప్రకారం వీక్లి ఆఫ్, జాతీయ సెలవులు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్ ఇస్తూ, నెల వారీ రీచార్జ్ చేయాలని కోరారు. ప్రమాదబీమా, ఎక్స్‌గ్రేషియా, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వాహనాలు మరమ్మతులు చేయాలని, రిపేర్లకు అయ్యే సొమ్ముని ముందుగా చెల్లించాలని కోరారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఆర్.ప్రకాశరావు, కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, ఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలను చక్కదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గురుకులాలను చక్కదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని దళిత సంఘాల జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు గురువారం ఎచ్చెర్ల మండల ప్రాథమిక పాఠశాలలో దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యాసౌకర్యాల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దళిత సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో గురుకులాల్లో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం భర్తీ గాని ఒక్క గురుకుల విద్యాలయం స్థాపించడం గానీ జరగలేదని, చివరకి విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వకుండా రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు, గత ప్రభుత్వం దళిత విద్యార్థులు విద్యపట్ల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని దానికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చక్కదిద్దాలని వారు తెలిపారు, ఈ కార్యక్రమంలో దళిత మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దెబారిక రాము, కవి ఉపాధ్యాయులు బొడ్డేపల్లి భూపతిరావు, బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు పడాల ప్రతాప్,సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, బీఎస్పీ నాయకులు కంట్లన రామారావు, అంబేద్కర్ చైర్ సాధన సమితి జిల్లా కన్వీనర్ టోంపల రవణ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు, ఎచ్చెర్ల సర్పంచ్ ప్రతినిధి తండ్యాన లక్ష్మణరావు, దళిత నాయకులు డీలర్ పట్నాన మహేష్, ఇనప దుర్గారావు, అలికాన లక్ష్మణరావు, లోపింటి గిరిబాబు, దేబారిక నారాయణరావు, శ్రీనివాస్ చౌదరి, అరుబారికి అప్పారావు, పుట్టా ఎల్లయ్య టీచర్, తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# రావివలస అభివృద్ధికి రూ.15 కోట్లు





- ముఖాముఖిలో పవన్ కల్యాణ్ హామీ
- భవానీ థియేటర్‌లో వర్చువల్ సమావేశం

(సత్యంన్యూస్, టెక్కలి)

రావివలస అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పవన్ కల్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వెండితెరపై వర్చువల్ ద్వారా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి రావివలస ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. 'మన ఊరు-మాటా మంతి' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక భవానీ థియేటర్‌ను వేదికగా చేసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులపైనా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామం మీదుగా వెళ్తున్న రోడ్డును డబుల్ రోడ్డు చేయాలని పవన్‌ను గ్రామస్తులు కోరారు. గ్రామంలో స్మశానానికి రూ.70 లక్షలు, దోబీఘాట్‌కు రూ.20 లక్షలు, డ్వాక్రా భవనానికి రూ.10 లక్షలు, ఎండల మల్లికార్జున స్వామి దేవాలయానికి గ్రామం నుంచి భక్తులు రాకపోకలు సాగించడానికి రెండు వైపులా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు టెక్కలి బర్మా కాలనీ నుంచి రావివలస మీదుగా వడ్డితాంధ్ర వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డును విస్తరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌కు ఆదేశించారు. దీంతో పాటు గ్రామంలో అనేక సమస్యలపై స్పందించిన పవన్ అభివృద్ధిలో భాగంగా రోడ్డును విస్తరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న ప్రసిద్ధ ఎండల మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసే లేఅవుట్లలో కాలువల నిర్మాణం పూర్తి చేసిన తర్వాతనే అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవల వడదెబ్బతో మృతిచెందిన ఉపాధి కూలీ కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారం అందించినట్లు తెలిపారు.

**పాస్‌లున్నా అనుమతి నిరాకరణ**

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజలతో ముఖాముఖి మన ఊరు - మాటమంతి కార్యక్రమం టెక్కలి మండలం రావివలస గ్రామాన్ని అధికారులు ఎంచుకున్నారు. టెక్కలి భవానీ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి రావివలస గ్రామస్తులకు కొంతమందికి పాసులు ఉన్నా లోపలికి పంపించలేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. అలాగే మీడియాను కూడా లోపలకు అనుమతించకపోవడంతో పోలీసులతో చర్చలు జరిపారు. ఏఎస్‌పి కె.శ్రీనివాస్‌తో మీడియా ప్రతినిధులు మాట్లాడితే ఆర్డీవో ఆదేశాల మేరకు తాము మీడియాను అనుమతించడంలేదని చెప్పడంతో మీడియా వారు వెనుతిరిగారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు, రావివలస ప్రజలు పాల్గొన్నారు.



# పోలాకిలో ప్రీ ఎక్లాంప్షియాపై అవగాహన



(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఏ తల్లీ ప్రసవిస్తూ మరణించకూడదు, ఏ బిడ్డా మరణించడానికి జన్మించకూడదనే సంకల్పంతో ప్రీ ఎక్లాంషియా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తల్లులను సంరక్షించడం, శిశువులను సురక్షితంగా ఉంచడం ప్రధాన లక్ష్యంగా గురువారం ప్రీ ఎక్లాంషియా డేను పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ మాట్లాడుతూ కవలలు లేదా అంతకంటే ఎక్కువ, ముందుగా జన్మించిన తల్లులు, అధిక రక్తపోటు లక్షణం ఉన్న గర్భిణీ స్త్రీలు, కిడ్నీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, కుటుంబ చరిత్రలో ప్రీ ఎక్లాంప్షియా ముందుగా ఉన్నట్లు గుర్తించబడిన గర్భిణీలు, 20 ఏళ్లలోపు, 35 సంవత్సరాలు దాటిన గర్భిణీలు, ఒబిసిటీ ఉన్న గర్భిణీలు ఎక్కువగా ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందన్నారు. గర్భిణికి 20 వారాలు దాటిన తర్వాత అధిక రక్తపోటు, అవయవాల క్షీణత లక్షణాలుగా ఈ వ్యాధి బయటపడుతుందని తెలిపారు. సకాలంలో గర్భిణీ తనిఖీలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని సకాలంలో గుర్తించవచ్చని, తద్వారా ఈ వ్యాధి నుంచి బయటపడే అవకాశం కూడా ఉందని అన్నారు. అధికంగా తలనొప్పి, అధిక రక్తపోటు, దృష్టిలో దోషం, ముఖం వాపు, కాళ్లు చేతులు వాపులు, శ్వాస పీల్చుకోవటం కష్టం, నీరుడు తగ్గటం, గ్యాస్ట్రిక్ నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయని, ఎప్పటికప్పుడు రక్తపోటును గమనించుకోవటం, అవసరమైన రక్త పరీక్షలను ఎప్పటికప్పుడు చేయించుకోవటం, ఏఎన్ఎం, వైద్యాధికారితో గర్భిణీ తనిఖీలు చేయించుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యవంతంగా ఉంటుందని, అలాగే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వటానికి మంచి అవకాశమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, పర్యవేక్షకులు, స్టాఫ్ నర్సు నాగమణి, కుమారి, ఏఎన్ఎంలు కృష్ణవేణి, ఉషా, సోమేశ్వరి, పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# రజకుల్ని రోడ్డున పడేయకండి

- పార్క్ పనులను అడ్డుకున్న దోబీలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ ప్రాంతంలో వంద కుటుంబాలకు పైగా రజకులు ఆధారపడిన దోబీఘాట్ స్థానంలో కొత్తగా పార్క్ నిర్మించి తమను రోడ్డున పడేయొద్దంటూ స్థానిక రిమ్స్ పరిసర ప్రాంత దోబీలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక శాంతినగర్ కాలనీ వద్ద ఉన్న నాగావళి తీరంలో గతంలో తాము వృత్తి నిర్వహించుకునేందుకు దోబీ ఘాట్‌లు, మంచినీటి ప్లాంట్లు ఏర్పాటు చేశారని, ఇప్పుడు వాటిని తొలగించి పార్కును నిర్మించడానికి పనులు జరపడం సబబు కాదని వారన్నారు. ఈ మేరకు ఎర్త్ పనులను గురువారం అడ్డుకున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిశామని, ప్రజాప్రతినిధులను కూడా కలుస్తామని, అంతవరకు పనులు నిలుపుదల చేయాలని వారు కోరారు.

## మినీ జెట్టితో మత్స్యకారుల జీవితాలు మారనున్నాయి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పెదగనగళ్లపేట వద్ద మినీ జెట్టి మంజూరుకావడంతో మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గురువారం పెదగనగళ్లవానిపేట మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి జెట్టి వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ ప్రాంతంలో ఉన్న వారంతా ఏకాభిప్రాయంతో ఏర్పాటుకు అంగీకరించాలని కోరారు. మత్స్యకారులంతా వారి వారి అభిప్రాయాలు తెలుపుతూ మినీ జెట్టి నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తీర్మానం చేశారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మత్స్యకారులు, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కొత్త ముఖాలు కనిపిస్తే తెలియజేయండి



- ఉగ్రవాదులు సముద్రం మీదుగా వచ్చే ప్రమాదం ఉంది
- కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ హరికృష్ణ
- మత్స్యకారులకు అవగాహన సదస్సు

(సత్యంన్యూస్, రణస్థలం)

మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, తీరం వెంబడి టెర్రరిస్టులు గాని, ఉగ్రవాదులు గాని సముద్రం మీదుగా వచ్చే సూచనలున్నాయని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణరావు సూచించారు. గురువారం పెద్దకొవ్వాడ, చిన్న కొవ్వాడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి గ్రామ పెద్దలు, మత్స్యకారులు, గ్రామ విజిలెన్స్ కమిటీ సభ్యులు, సాగర్ మిత్ర, గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్‌లతో అవగాహన సదస్సు నిర్వహించారు. వేటకు వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎవరైనా కొత్తముఖాలు తారసపడినా, నిషేధిత అక్రమ రవాణా చేసేవారు తారసపడినా తక్షణమే కళింగపట్నం మెరైన్ పోలీసులకు గాని, స్థానిక లోకల్ పోలీసులకు గాని తెలియజేయాలని సూచించారు. కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093 లేదా కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఫోన్ నెంబర్ 93929 14712కు వివరాలు తెలపాలని కోరారు.






# కార్యసాధకుడు ఆంజనేయుడు

- జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మనోవేగంతో, వాయువేగంతో ప్రయాణం చేసి కార్యాన్ని పూర్తి చేయగల కార్యసాధకుడు హనుమంతుడని జనసేన నాయకులు, ప్రముఖ గైనిక్ వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. గరిమెళ్ల కొత్తవలస పంచాయతీ కర్నేనపేట గ్రామంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆరాధన సేవకు నిలువెత్తు సాక్ష్యం హనుమంతుడని కొనియాడారు. అంతకుముందు స్వామి వారికి ఆకు పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నేనపేట గ్రామసర్పంచ్, జనార్ధన్, యువత, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులను ఆకట్టుకున్న కోలాటం




(సత్యంన్యూస్, లావేరు)

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కోలాటం విద్యార్థులను ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీ వీరభద్ర స్వామి కోలాటం నిర్వాహకులు నక్కిన శ్రీదేవి, కనకం రత్నకుమారి, అల్లాడ పద్మ, వట్టి ప్రభావతి, ఉప్పు సూర్యకళ, హేమలతతో పాటు మరో 10 మందితో కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ కోలాటం జానపద కళని తెలుగు జానపదుల జీవితాలతో పెనవేసుకుపోయిందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను గ్రంథాలయాధికారి, పోస్టు మాస్టర్ లక్ష్మి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు విద్యార్థులు పాల్గొన్నారు.

# నంబాల మృతదేహం అప్పగించలేదు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పోలీసుల ఎదులుకాల్పుల్లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించలేదు. బుధవారం నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో అధినేతలతో పాటు మాడ్ డివిజన్ పీఎల్‌జీఏకు చెందిన సీనియర్ కేడర్ ఉన్నారని సమాచారం అందడంతో సోమవారం నుంచి ఆపరేషన్ ప్రారంభమైంది. ఇందులో భాగంగానే జిల్లాకు చెందిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు(70) మృతిచెందారని పోలీసులు బుధవారం నిర్ధారించారు. అయితే ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం తీసుకువెళ్లాలంటూ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన పోలీసులే గురువారం మృతదేహాన్ని ఇవ్వడానికి నిరాకరించినట్టు భోగట్టా. నంబాల కేశవరావు సోదరుడు రాంప్రసాద్‌తో పాటు మరికొందరు జగదల్‌పూర్ వరకు వెళ్లిన తర్వాత మృతదేహాన్ని అప్పగించలేమంటూ పోలీసులు సమాచారమిచ్చినట్టు తెలుస్తుంది. కేశవరావు మృతిపైన, జరిగిన ఎన్‌కౌంటర్‌పైన తాము ఎటువంటి అభ్యంతరాలు లేవనెత్తడంలేదని, కనీసం మృతదేహాన్ని అప్పగిస్తే సంప్రదాయం మేరకు దహన సంస్కారాలు నిర్వహిస్తామంటూ కేశవరావు మరో సోదరుడు ఢిల్లీశ్వరరావు కూడా పోలీసులతో మాట్లాడినా ఫలితం దక్కలేదు. కేశవరావు ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయని, సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైన నేపథ్యంలో మరోమారు పోస్ట్‌మార్టం చేయాల్సి వుంటుందని, అందుకే మృతదేహం అప్పగించడం లేదని చెబుతున్నారు. అయితే సుప్రీంకోర్టులో ఈ మేరకు పిటిషన్ పడిందా, లేదా అనేది అధికారికంగా ఎటువంటి నిర్ధారణ జరగలేదు. నంబాల మృతి తర్వాత కిశోర్‌బాబు జాస్తి అనే వ్యక్తి ఫేస్‌బుక్ వాల్‌లో మాత్రం సీపీఐ ఎంఎల్ జనరల్ సెక్రటరీ విశ్వం ఢిల్లీ నుంచి పేర్కొన్నట్లు ఒక ప్రకటన కనిపించింది. అనారోగ్యంతో బాధపడుతున్న కేశవరావును ఒడిశాలో ఓ ఆసుపత్రి నుంచి ఎత్తుకుపోయి కాల్చేశారని విశ్వం ఆ ప్రకటనలో పేర్కొన్నట్లు కిశోర్‌బాబు జాస్తి వాల్ మీద కనిపిస్తుంది. నంబాల కేశవరావుతో సహా 27 మంది దళసభ్యులను మట్టుబెట్టడం గర్వంగా ఉందంటూ స్వయంగా ప్రధాని, కేంద్ర హోంమంత్రి అమిషాయే ప్రకటించడం చూస్తే దీన్ని ప్రభుత్వం ఎంతటి సవాల్‌గా తీసుకుందో అర్థమవుతుంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.